నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | NALGONDA

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

- నల్లగొండలో 2లక్షలకు పైగా జవాబు పత్రాల వాల్యుయేషన్ పూర్తి

రామగిరి, ఏప్రిల్ 13 : పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం ముగిసింది. నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేయగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2లక్షలకు పైగా ఆయా సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు వచ్చాయి. ఈ నెల 3నుంచి 13వరకు మూల్యాంకనం క్యాంపు అధికారి, డీఈఓ బి.భిక్షపతి నిత్యం పర్యవేక్షిస్తూ మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేయించారు. క్యాంపులో 88 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 538 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 182మంది స్పెషల్ అసిస్టెంట్స్‌తోపాటు పలువురు అధికారులు మొత్తం 1000మందికి పైగా పనిచేశారు. మూల్యాంకనం ఉత్తర్వులు పొంది విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై డీఈఓ భిక్షపతి షోకాజ్ నోటీసులు జారీచేసి కలెక్టర్‌కు సమస్య వివరించడంతో ఆ తర్వాత అంతా హాజరయ్యారు. సంపూర్ణంగా మూల్యాంకనం ముగియడంతో ఉపాధ్యాయులందరికీ డీఈఓ ధన్యవాదాలు తెలిపారు.

కృత్రిమ కరువు సృష్టించింది కాంగ్రెస్సే

- 2014కు ముందు పరిస్థితులు పునరావృతమవుతున్నయ్
- రెండు పార్లమెంట్ స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే
- నకిరేకల్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నకిరేకల్ : బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, వేదికపై జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్య, రాష్ట్ర నాయకులు ఒంటిద్దు నరసింహారెడ్డి, దూదిమెట్ల

నకిరేకల్, ఏప్రిల్ 13 : తెలంగాణ రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించింది కాంగ్రెస్సేనని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక 2014కు ముందున్న పరిస్థితులు పునరావృతమవుతున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే అసలు రూపం బయటపెట్టుకుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని, ప్రజలను మోసం చేసే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని విమర్శించారు. ఏ ఒక్క హామీని నెరవేర్చే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ప్రజలు గుర్తించారన్నారు. కరువు, మంచినీటి సమస్యను బయటకు రానీయకుండా, కరెంటు ఇవ్వలేని చేతకానితనాన్ని బయట పడనివ్వకుండా ఉండేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో డ్రామాను తెరపైకి తీసుకొస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాలకు 24 గంటల కరెంటు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు ఇవ్వలేక మోటార్లు కాలపెట్టే పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లేస్తే మళ్లీ చీకటి రోజులు తెస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మెడలు వంచాలంటే, ప్రభుత్వంపై పోరాటం చేయాలంటే బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు తొందరల్లోనే గుర్తించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసహనంతో ఉన్నారని, నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు దూదిమెట్ల బాలరాజు, చెరుకు సుధాకర్, చింతల సోమన్న, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, జడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, తరాల బలరాం, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళమెత్తుతా

35 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్న. నా మీద ఆవగింజంత తప్పు కూడా లేదు. భువనగిరి ఎంపీగా నన్ను గెలిపిస్తే ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతా. బీఆర్ఎస్ నుంచి వెళ్లిన వాళ్లే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులుగా ఉన్నారు. గెలిచిన నెల రోజుల్లోనే కుర్చీల పంచాయితీ మొదలైంది. మళ్లీ గెలిపిస్తే పంచాయితీలు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదు. అధికార పార్టీకి భయపడాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ శ్రేణులంతా ప్రజల్లో ఉండి గెలుపు కోసం కృషి చేయాలి. అన్ని జాతులు, కులాలు, మతాలను సెక్యులర్‌గా చూసే గొప్ప వ్యక్తి కేసీఆర్. నన్ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తా.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి

ఆటుపోట్లు ఉంటయ్.. అయినా కష్టపడుదాం

ఎన్నికల్లో ఆటుపోట్లు ఉంటయ్.. అయినా నిరుత్సాహపడకుండా కష్టపడుదాం. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం. చంద్రబాబు కనుసైగల్లో నడిచే వ్యక్తి రేవంత్‌రెడ్డి. ఆనాడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ ఎండిపోయింది. ఈనాడు శిష్యుడు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నాడు.. ఏ పల్లెకు పోయినా నీళ్లు లేక, పంటలు పండక కరువు విలయతాండవం చేస్తుంది. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరు. మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నరు. నకిరేకల్ సెంటర్‌లో చిరుమర్తి లింగయ్య నిర్మించిన సర్కిల్‌ను కూల్చేశారు. 100 పడకల ఆస్పత్రిని కూడా కూల్చేస్తారా? బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తూ పోలీసులతో కొట్టిస్తున్నారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు నెరవేర్చలేదు. ఎంపీ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ఇక హామీలను నెరవేర్చేదెన్నడు. ప్రజలకు మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. కానీ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరం కలిసి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం.

– చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇబ్బందులు

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రైతులు రైస్ మిల్లుల వద్ద లైన్లలో నిలబడి వడ్లు అమ్ముకుంటున్నారు. మూడు నెలల్లో రేవంత్‌రెడ్డి పాలనను, కేసీఆర్ పాలనను పోల్చుకుంటున్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని ఓట్ల ద్వారా చూపిస్తారు. అప్పట్లో ఏ సమస్య వచ్చినా కేసీఆర్ వెంటనే స్పందించి నిర్ణయం తీసుకుని సమస్య పరిష్కరించేవారు. ఇప్పుడు సమస్య వస్తే మంత్రివర్గంలో ఉన్నవాళ్లు ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి. ఆరోజు కేసీఆర్ రైతుబంధు ఇస్తామని రూ.7వేల కోట్లు సిద్ధం చేస్తే ఈసీకి ఫిర్యాదు చేసి రానీయకుండా రేవంత్‌రెడ్డి చేసిండు. ఆ డబ్బులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టిండు. పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందాం.

– బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్

కాంగ్రెస్‌వి ఆచరణ సాధ్యంకాని హామీలు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలన్నీ ఆచరణకు సాధ్యంకానివి. 125 రోజుల్లోనే తెలంగాణ ప్రజలకు చుక్కలు చూపించిన మూర్ఖుడు రేవంత్‌రెడ్డి. ఇందులో 25 రోజులు ఢిల్లీకి పోయిండు. ఎంపీలు, ఎమ్మెల్యేల పంచాయితీలు, భూముల పంచాయితీలు, కుర్చీని ఎవడన్న లాగుతాడేమోనన్న పంచాయితీలు తప్ప తెలంగాణ పరిపాలనకు టైం లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి పిచ్చిపిచ్చిగా మాట్లాడడం సబబు కాదు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి మేధావి బీఆర్ఎస్‌లో చేరారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ నీతి, నిజాయితీ గల కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. ఆయనకు 35 ఏండ్లు రాజకీయాల్లో అపారమైన అనుభవం ఉంది. ఆయన్ను గెలిపిస్తే బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం చేస్తాడు. బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసి క్యామ మల్లేశ్ గెలుపు కోసం కృషి చేయాలి.

– బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం రాశులు

సూర్యాపేట మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- అందని మద్దతు ధర

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 13 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతుంది. మార్కెట్‌కు నిత్యం 50వేల నుంచి 60వేల బస్తాల వరకు రైతులు తీసుకొస్తున్నారు. అయితే.. ధర తక్కువ పడుతుండడం, కాంటాలు, ఎగుమతులకు ఆలస్యం అవుతుండడంతో రైతులకు ఇబ్బంది కాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రోజూ 30వేల నుంచి 35వేల బస్తాల వరకు ధాన్యాన్ని అనుమతించేందుకు మార్కెట్ అధికారులు కమీషన్‌దారులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. ఆ టోకెన్ల మేరకు శనివారం వ్యవసాయ మార్కెట్‌కు 30,574 బస్తాల ధాన్యం వచ్చింది. అయితే.. ధాన్యం ఎక్కువగా వస్తుండడంతో కొద్ది మంది రైతులకు మాత్రమే మద్దతుకు మించి ధర అందిస్తున్నారు. మిగతా వారికి తాలు, చెత్త, తేమ పేరుతో తక్కువ ధర పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు రైతులు 106 బస్తాల పాత బీపీటీ ధాన్యం తీసుకురాగా క్వింటాకు రూ.2709 నుంచి రూ.2,389 వరకు ధర పలికింది. 389 మంది రైతులు 18,800 బస్తాల జైశ్రీరాం రకం ధాన్యం తీసుకురాగా రూ.2,556 నుంచి రూ.1501 ధర పలికింది.

151మంది రైతులు ఐఆర్ 64 రకం ధాన్యం తేగా రూ.1849 నుంచి రూ.1546వరకు, 100 మంది రైతులు హెచ్ఎంటీ ధాన్యం తీసుకురాగా, రూ.2,249 నుంచి రూ.1519 వరకు, ఆర్ఎన్ఆర్ తెచ్చిన ఇద్దరు రైతులకు రూ.1903 నుంచి రూ.1659 ధర పలికింది. ఈ ఏడాది అసలే కాలం కాక పండిన కొద్ది పంటకు కూడా సరైన ధర అందడంలేదని, దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దామరచర్ల మండలం తిమ్మాపురంలో ట్యాంకు నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో నీటి సరఫరా

- నమస్తే కథనానికి స్పందన

దామరచర్ల, ఏప్రిల్ 13 : మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీన నమస్తే తెలంగాణ పత్రికలో 'పల్లెల్లో నీటి సమస్య' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంపత్, ఏఈ రవికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని రాజగట్టు, కొండ్రపోల్, తిమ్మాపురం, తెట్టకుంట తదితర గ్రామాల్లో నెలకొన్న బోర్లు, పైపులైన్ల సమస్యలను పరిష్కరించారు. లీకేజీలు ఉన్న పైపులను తొలగించి కొత్త పైపులను బిగించి తాగునీటిని అందించారు. దీనితోపాటు నీటి సమస్య ఉన్న మరికొన్ని గ్రామాల్లో కూడా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామానికీ అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీళ్లు లేక రక్షిత నీటి పథకాలు కొన్ని పనిచేయడం లేదని, దాంతో అద్దె బోర్లు తీసుకొని వాటి ద్వారా నీటిని అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

ఐకేపీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

తుంగతుర్తి, ఏప్రిల్ 13 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధాన్యం క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలం బండరామారం ఐకేపీ సెంటర్ వద్ద శనివారం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు వీరబోయిన రమేశ్, మాజీ సర్పంచ్ గడ్డం ఉప్పలయ్య, ఆకారపు సైదులు, నాయకులు పులుసు ఉప్పలయ్య, సోమనర్సయ్య, దేవేంద్ర, బక్కయ్య, నరేశ్, వీరసోములు పాల్గొన్నారు.

యువతా మేలుకో.. ఓటు నమోదు చేసుకో

- ఓటు నమోదుకు ఈ నెల 15 వరకు గడువు
- 18 ఏండ్లు నిండిన వారు అర్హులు

నేరేడుచర్ల , ఏప్రిల్ 13 : సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు, ప్రజాస్వామ్యంలో ప్రజలు నిజాయితీ సమర్థత గల నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢవిల్లుతుంది. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. జనవరి 31, 2024 వరకు 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదయ్యేందుకు వీలు కల్పించింది. గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఓటు హక్కును నమోదు చేసుకోని వారు త్వరపడి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో ఓటు హక్కు పొందిన వారంతా సమీప బూత్ లెవెల్ కేంద్రాల్లోని ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో, లేదో, తప్పులు ఉన్నాయో అన్న విషయం పరిశీలించుకోవాలన్నారు. జాబితాలో తమ పేర్లు లేకుంటే వెంటనే అక్కడ ఓటు నమోదు చేసుకోవాలి. 01-31-2024 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకునేందుకు ఇదే మంచి అవకాశం. ఓటరు ముసాయిదా జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఫారం-8లో దరఖాస్తు చేసుకోవచ్చు. దాంతో పాటు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, రేషన్, ఆధార్ కార్డుతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం జతచేయాలి.

ఏ ఫారం ఎందుకంటే

- **ఫారం-6 :** కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం-6ను ఉపయోగించాలి. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు (లేకుంటే నివాస చిరునామ ధ్రువీకరణ పత్రం జతపరచాలి)
- **ఫారం-7 :** ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం-7ను ఉపయోగించాలి. విచారించిన తర్వాత పేర్లు తొలగిస్తారు
- **ఫారం -8 :** పేరు, పుట్టిన తేదీల్లో తప్పులను సవరించేందుకు ఫారం-8ను పూరించి ఇవ్వాలి. ఈ ఫారానికి సరిచేయాల్సిన పేరుకు సంబంధించిన డిక్లరేషన్, 10వ తరగతి మార్కుల జాబితా, డ్రైవింగ్ లైసెన్స్, లేదా ఏదో ఒకటి జతపరుచాలి
- **ఫారం-8ఏ :** చిరునామ మార్చేందుకు ఫారం-8ఏ ను ఉపయోగించాలి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు పూర్వ చిరునామతో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్‌ను, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జతపరిస్తే సరిపోతుంది
- **ఫారం-6ఏ :** ఎన్ఆర్ఐలు ఫారం-6ఏ ను ఉపయోగించాలి. ఇందుకు తాము నివాసముంటున్న దే శాల్లో సిటిజన్ మెంబర్‌షిప్ లేదని, అక్కడి అంబాసిడర్‌తో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రోగులకు అన్ని వైద్య సేవలు అందేలా చర్యలు

- విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

నందికొండ, ఏప్రిల్ 13 : నందికొండలోని హిల్‌కాలనీ కమలా నెహ్రూ ఏరియా దవాఖానలో రోగులకు మరిన్ని వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. కమలా నెహ్రూ ఏరియా దవాఖానను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగుల వార్డులు, రికార్డులు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైనకాలజిస్ట్ డాక్టర్ల కొరత ఉందని, పూర్తి స్థాయిలో డెలివరీలు ఇక్కడ జరుగడం లేదని, ఎక్కువ శాతం డెలివరీ మహిళలను నల్లగొండకు రెఫర్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. డెలివరీ కేసుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు. ఆప్తా, ఈఎన్‌టీ, డెంటల్ విభాగాల్లో ల్యాబ్ వసతులు పూర్తి స్థాయిలో లేవని, సేవలు కూడా సరిగా అందడం లేదని గుర్తించామని తెలిపారు. ఆర్థోపెడిక్ సేవలు రోగులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దవాఖానలో వసతులు, డాక్టర్, ల్యాబ్ వసతుల కొరతపై పూర్తి స్థాయిలో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. అంతకు ముందు డాక్టర్లతో దవాఖానలోని వసతులపై సమీక్ష నిర్వహించారు. ఆయనతోపాటు దవాఖాన సీఎంఓ భానుప్రసాద్, డాక్టర్లు ఉన్నారు.

నల్లగొండ మండలం కొత్తపల్లిలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

త్వరగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 13 : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరిత గతిన కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. నల్లగొండ పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని శనివారం అదనపు కలెక్టర్‌తో పాటు డీఎస్ఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆర్జాల బావి, కంచనపల్లి, కొత్తపల్లి ఐకేపీ కేంద్రాలను వారు సందర్శించి రైతులకు, కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. ఆయన వెంట డీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఎం వినోద, సీఈఓ అనంతరెడ్డి, శ్రీనివాస్ రైతులు ఉన్నారు.

శుక్రవారం కురిసిన వర్షానికి నల్లగొండ మండలం ఆర్జాలబావి ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

సమాచార హక్కు చట్టంతో అవినీతి తగ్గుముఖం

- ఉమ్మడి ఏపీ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 13 : సమాచారం హక్కు చట్టంతో అవినీతి తగ్గుముఖం పట్టిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలోని పెన్షనర్స్ భవన్‌లో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, సేవా సదన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓ ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉందని, సమాచారం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు చైతన్యం పొందేందుకు లోక్‌పాల్ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, గృహహింస చట్టం అమల్లోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఆర్టీఐ కార్యకర్తలు కీలకమని, త్వరలోనే భువనగిరి నియోజకవర్గంలో ఆర్టీఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.